ఈనాడు
హైదరాబాద్





జులై 2 నుంచి..

## అమెరికాలో 'తెలుగు సంబరాలు'

హైదరాబాద్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) జులై 2,3,4 తేదీల్లో 'తెలుగు సంబరాలు' నిర్వహించనుంది. ఫ్లోరిడా(అమెరికా)లోని అర్లాండో అరంజ్ కౌంటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఇవి జరుగుతాయని నాట్స్ అధ్యక్షుడు డా॥నాదెళ్ల రాణాకుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. అమెరికాలోని ప్రవాసాంధ్రులకు అండగా నిలిచేందుకు నాట్స్ సంస్థను నెలకొల్పామన్నారు. తెలుగువారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నాట్స్ అండగా నిలుస్తుందని చెప్పారు. ఇటీవల సెయింట్ లూయిస్‌లో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విద్యార్థులకు సాయం చేసేందుకు 35వేల డాలర్లు తమ సంస్థ సేకరించిందన్నారు. వీటిని ఆయా విద్యార్థుల కుటుంబాలకు అందజేస్తామని రాణాకుమార్ తెలిపారు. చికాగోలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం వల్ల తెలుగు విద్యార్థుల సామాగ్రి మొత్తం కాలిబూడిదవ్వడంతో వారిని కూడా నాట్స్ ఆదుకుందన్నారు. తెలుగు సంబరాలకు సినీ ప్రముఖులు కీరవాణి బృందం, తనికెళ్ల భరణి, సాయికుమార్, హీరోయిన్లు కాజల్, సంజన, నమిత, శ్రియతోపాటు శ్రీకాంత్, ఆలీ, ఆహుతి ప్రసాద్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక సంగీత విభావరి, జానపద సంప్రదాయ నృత్యాల సమ్మేళనం, తెలుగు గజల్స్, మిమిక్రీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 23న తాజ్ దక్కన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు రాణాకుమార్ వెల్లడించారు.